

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 3 ఏప్రిల్ 2024



వరదకాలువకు నీరు..
పంటలకు జీవం

రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయాలి 8

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 బుధవారం
సహర్ 4:39 గురువారం



'అమ్మ'కే పిల్లల బాధ్యత



సిరిసిల్లలో పాఠశాల

- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పేరుతో ఏర్పాటు
- చైర్‌పర్సన్‌గా గ్రామైఖ్య సంఘాల వీవోలు
- సర్కారు పాఠశాలల పర్యవేక్షణలో మహిళా సంఘాల సభ్యుల భాగస్వామ్యం
- జిల్లాలో 309 కమిటీల ఏర్పాటు
- నాలుగేళ్ల తరువాత కొత్త కమిటీలకు శ్రీకారం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, పర్యవేక్షణ ప్రభుత్వం మహిళ సంఘాలకు అప్పగించింది. గత ప్రభుత్వం నాలుగేళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేసిన విద్యా కమిటీలకు కొత్త ప్రభుత్వం జనవరిలో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చినా మళ్లీ మార్పులు చేసి ఈ నెలలో అమ్మ అదర్శ పాఠశాల కమిటీల పేరుతో గ్రామైఖ్య సంఘాలకు అప్పగించింది. మార్చి 14న జీవో జారీ కావడంతోనే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ప్రక్రియను పూర్తి చేశారు. పాఠశాల నిర్వహణ, గ్రామస్థాయిలో అభివృద్ధి, పాఠశాలల్లో స్వయం సహాయక సంఘాల బృందాల భాగస్వామ్యం, వసతుల కల్పన, పర్యవేక్షణ వంటి బాధ్యతలు కమిటీలకు అప్పగించింది. ఇప్పటికే యూనిఫాం, సంబంధించిన బాధ్యతలు కూడా స్వశక్తి సంఘాలకు ఆర్డర్లు ఇచ్చారు. మధ్యాహ్న భోజన నిర్వహణ కొనసాగిస్తున్నారు. నూతనంగా వచ్చిన అమ్మ అదర్శ పాఠశాల కమిటీల్లో అయా గ్రామ, పట్టణ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కమిటీకి చైర్‌పర్సన్‌గా ఉంటారు. ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థుల తల్లులు ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరు కూడా మహిళ సంఘాల్లో సభ్యులై ఉండాలి. ఇందులో ఒకరు ఎస్సీ, ఎస్టీ ఉంటారు. పాఠశాల విద్యార్థుల సంఖ్యను బట్టి 15 నుంచి 17 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అదర్శ కమిటీలు పాఠశాల నిర్వహణలో హాజరు శాతం పెరిగేలా సర్కారు పాఠశాలను బలోపేతం చేసే విధంగా చూడాల్సి ఉంటుంది. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, మరమ్మతులు, సోలార్ ప్యానళ్ల ఏర్పాటు, యూనిఫాంల తయారీ, మధ్యాహ్న భోజనం అమలు వంటివి పర్యవేక్షిస్తారు.

• పాఠశాలలకు 'ఉపాధి' నిధులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 510 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఏడు మోడల్ స్కూల్‌లు, 13 కస్తూర్బా, అర్బన్ రెసిడెన్షియల్, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలలో దాదాపు 49 వేలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. 510 పాఠశాలల్లో 309 పాఠశాలలకు అమ్మ అదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా కొత్తగా ఏర్పడ్డ అదర్శ కమిటీల ద్వారా పాఠశాలలో చేపట్టే పనుల కోసం ఉపాధి హామీ పథకం, ప్రత్యేక అభివృద్ధి నిధులు, ఇతర ప్రభుత్వ సంస్థలు ఇచ్చే నిదులను ఖర్చు చేయాలని నిర్ణయించారు. పాఠశాలల్లో వసతుల కల్పనలో నిధుల ఖర్చుపై అజమాయిషీ ఉంటుంది. పాఠశాలల అభివృద్ధి పనులు 25 వేల రూపాయలు, అంతకంటే తక్కువ వ్యయంతో చేపడితే కమిటీ తీర్మానంతోనే పూర్తి చేస్తారు. ఎక్కువ వ్యయంతో చేపట్టాల్సి ఉంటే జిల్లా సమాఖ్యల ద్వారా జిల్లా కలెక్టర్‌కు నివేదించి పనులు చేపట్టాల్సి ఉంటుంది. గ్రామాల్లో మహిళ సంఘాల పర్యవేక్షణలో పాఠశాలల పనితీరు ఎలా ఉండబోతుందోననే ఆసక్తి ఏర్పడింది.

వేసవి సెలవులు ముగిసేలోగా పాఠశాలల్లో మరమ్మతులు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- అమ్మ అదర్శ పాఠశాలల అమలుపై సమీక్ష

సిరిసిల్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసేలోగా జిల్లాలోని అయా పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు, పనులు చేయించే విధానంపై మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి నీటిపారుదల, పంచాయతీరాజ్, అర్అండ్‌బీ, మున్సిపల్, పీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ, ప్యాకేజీ 9, ఈఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 510 పాఠశాలలు ఉండగా 309 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీల ఆధ్వర్యంలో స్కూళ్లలో తాగునీరు, తరగతి గదుల్లో చిన్నచిన్న మరమ్మతులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించి కమిటీల ఆధ్వర్యంలో మరమ్మతు పనులు పూర్తి చేయాలని సూచించారు. జాతీయ బ్యాంకులలో కమిటీల ఖాతాలు తెరిపించాలని అన్నారు. సమావేశంలో టీఎస్‌ఈడబ్ల్యూ ఐడీసీ ఈఈ అనితాసింగనాథ్, డీఈవో రమేష్‌కుమార్, పీఆర్ ఈఈ సూర్యప్రకాష్, డీఆర్‌డీవో శేషాద్రి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ కమిటీలపై సమీక్షిస్తున్న కలెక్టర్

ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

- వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్



5కే రన్ ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ, ఏప్రిల్ 2: ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతీఒక్కరు తమ ఓటును వేసి సద్వినియోగం చేసుకోవాలని వేములవాడ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రాజేశ్వర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు మంగళవారం వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ మాట్లాడుతూ ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌లో అందుబాటులో ఉన్న సేవలు, ఓటు హక్కు నమోదుకు అర్హత వయసు, ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లో ఓటు హక్కు ఎలా నమోదు చేయాలి, ఫారం నంబర్-6 వినియోగంపై అవగాహన కల్పించారు. మార్చి 31వ తేదీ వరకు 18 సంవత్సరాల వయసు నిండిన వారు ఓటును నమోదు చూసుకోవాలని సూచించారు. ఓటు హక్కు నమోదులో తరచూ చేసే తప్పులు ఎలా నివారించాలనే తదితర అంశాలపై వివరించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాలు, పట్టణాల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, స్వీప్ నోడల్ అధికారి, అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ అధికారి రాందాస్, తహసీల్దార్ మహేశ్ కుమార్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ శ్రవణ్ కుమార్, యువకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించాలి

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



పరిశీలిస్తున్న సెస్ చైర్మన్

వేములవాడ, ఏప్రిల్ 2: విద్యుత్ సంబంధిత సమస్యల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధి, కోనాయిపల్లి, మల్లారం రహదారిలో అత్యవస రంగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుపై మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలపై ప్రజలు, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాలకు సంబంధించి అంచనాలను రూపొందించాలని సూచించారు. సెస్ ఎండీ రమేశ్, ఏడీఈ శ్రీధర్, ఏఈ సిద్ధార్థ, నాయకుడు లక్ష్మీరాజం ఉన్నారు.

తప్పిపోయిన వృద్ధుడు.. డే కేర్ సెంటర్‌లో అప్పగింత



వృద్ధుడిని డే కేర్ సెంటర్‌లో చేర్పిస్తున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: తప్పిపోయి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బస్టాండులో సంచరిస్తున్న వృద్ధుడు కొక్కుల నరసయ్యను స్థానికులు గమనించి మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో మంగళవారం చేర్పించారు. సెంటర్ ఇన్‌చార్జి మమతతో మాట్లాడి వృద్ధుడికి ఆశ్రయం కల్పించారు. వృద్ధుడికి చెవులు సరిగా వినిపించకపోవడంతో తన కుటుంబ సభ్యుల పేర్లు తన సొంత గ్రామం పేరు చెప్పలేకపోతున్నారని స్థానికులు పేర్కొన్నారు. తనది ఓబులాపూరం గ్రామం అని ఓసారి చెబుతున్నారని తెలిపారు. వృద్ధుడిని ఎవరైనా గుర్తిస్తే మండల కేంద్రంలోని డే కేర్ సెంటర్ లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు బాలరాజు, సంజీవరెడ్డి, నాగరాణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కార్యవర్గం

కోనరావుపేట, ఏప్రిల్ 2: కోనరావుపేట మండల బీఎస్పీ నూతన కార్యవర్గ మంగళవారం జరిగింది. అధ్యక్షునిగా కుమ్మరి దేవదాస్, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కొమ్ము ప్రశాంత్, కోశాధికారి బడుగు జోసెఫ్, కార్యదర్శి మేకల ప్రసాద్, మేకల రమేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీఎస్పి జిల్లా, మండల నాయకులు గసికంటి అరుణ్, వరదవెల్లి స్వామి గౌడ్, చంద్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించాలని చూస్తున్న బీఆర్ఎస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, ఏప్రిల్ 2: రాష్ట్రంలో కృత్రిమ కరువును సృష్టించాలని బీఆర్ఎస్ పార్టీ చూస్తోందని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి, తిమ్మాపూర్, రామన్నపేట గ్రామాల్లో మంగళవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దాదాపు 50 మంది యువతి, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు ఎమ్మెల్యే పదవిని కేవలం వారి హోదాకు చిహ్నంగా వాడుకున్నారే తప్ప మన ప్రాంతం అభివృద్ధికి, ప్రజలకోసం కాదన్నారు. చందుర్తి మండలాన్ని ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆశిరెడ్డిపల్లి పరిధిలోని కొత్త చెరువు, ననుగుల ఎర్ర చెరువు, పటేల్ చెరువు, కలికోట సూరమ్మ చెరువు నిర్మాణం పట్టించుకోలేదన్నారు. ఆనాడు చేసిన పనులకు కాంట్రాక్టర్లుకు బిల్లులను కూడా సరిగా చెల్లించలేదని, మేము వచ్చాక చెల్లించామన్నారు. రాష్ట్రంలో సాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రైతు భరోసాపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ వారి మాటలు చూస్తుంటే బావాబామ్మర్దులు (హరీశ్‌రావు, కేటీఆర్) కలిసి రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించాలని కంకణం కట్టుకున్నారని అనిపిస్తోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కల్వకుంట్ల కుటుంబం బందీ అయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిచుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలో ఎవరేవరు మాట్లాడుతున్నారో విన్న మీరు ఈరోజు నైతికత గురించి మాట్లాడడం చూస్తే విడ్డూరంగా ఉందన్నారు. వేములవాడలో తన మాటలు కూడా విన్నారన్నారు. ఆ కేసులో ఎక్కడ అరెస్ట్ అవుతామో అని భయంతో నోటికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో కృత్రిమ కరువు బీఆర్ఎస్ వారే సృష్టిస్తున్నారని, లక్షల కోట్ల ప్రజాధనంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి అది కుంగిపోగానే పది టీఎంసీల నీటిని సముద్రంలోకి విడిచి పెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా తెలంగాణ రైతాంగానికి ఎలాంటి లోటు రాకుండా సాగునీటికి నీరు అందిస్తున్నా మన్నారు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. అయా గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, పొద్దుపొడుపు లింగారెడ్డి, అంచ రాంరెడ్డి, భీమారాజు కనకరాజు, బొజ్జ మల్లేశం, నల్మాసు భూంరెడ్డి, పులి సత్తయ్య, గొట్టె ప్రభాకర్, అంచ సుమ-శ్రీహరిరెడ్డి, వెల్పుల దేవాస్వామి, ముస్కు ముకుందరెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం

- ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి



సన్మానిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2: ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో రహీంఖాన్‌పేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తూముకుంట మోహన్‌రెడ్డి పదవీవిరమణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మోహన్‌రెడ్డి సన్మాన సభ చూస్తుంటే ఉత్తమ ఉపాధ్యాయులకు సంఘంలో ఎంతటి గౌరవం దక్కుతుందో అర్థం అవుతుందన్నారు. ఉద్యోగి జీవితంలో పదవీవిరమణ తప్పదన్నారు. ఉపాధ్యాయులే భావిభారత పౌరులను తయారు చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్, ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, పీఆర్టీయు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, ఎంఈఓ బన్నాజీ, ఏసీజీఎఫ్ వెంకటేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత, రిటైర్డు ఉపాధ్యాయుడు చిట్టి ఆనందరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం సందీప్‌రెడ్డి, కొమ్ము రమేష్, సదానందం, సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వస్త్ర ఉత్పత్తులపై వర్క్ షాప్

సిరిసిల్ల రూరల్ ఏప్రిల్ 2: సిరిసిల్ల పట్టణంలో వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ల ఆర్డర్లపై హైదరాబాద్ పత్తర్ ఘట్‌కు చెందిన వ్యాపారులు బుధవారం వర్క్ షాప్ ఏర్పాటు చేయడం జరిగిందని వ్యాపారులు మంగళవారం తెలిపారు. పట్నంలోని బీవై నగర్ షాదీ ఖానా భవనంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి జరిగే వర్క్‌షాప్ పట్టణంలోని మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐ యూనిట్లు ఆసాములు యజమానులు వచ్చి పత్తర్‌ఘట్‌కు చెందిన వ్యాపారులు అవసరమైన వస్త్ర ప్రదర్శన ప్రదర్శిస్తారని తెలిపారు. వాటిని పరిశీలించి వస్త్ర ఆర్డర్లను పొంది ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని వ్యాపారులు కోరారు.

ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

వేములవాడ, ఏప్రిల్ 2: వేములువాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురు సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడ్డట్టు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఇటీవల పట్టణ సీఐ వి కరుణాకర్‌ను ఐజీ కార్యాలయానికి బదిలీ చేయడంతోపాటు మరో 11మంది కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ క్రమంలో పోలీస్ సిబ్బందిపై వచ్చిన ఆరోపణలపై జరిపిన విచారణ నివేదిక మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్ రైటర్ శంకర్, కానిస్టేబుళ్లు అరుణ్, సురేశ్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ నిర్ణయం తీసుకున్నారు. ఇసుక అక్రమ రవాణా, మహాశివరాత్రి సందర్భంగా బెల్లం వ్యాపారుల వద్ద ముడుపులు తీసుకోవడం, పోలీస్ స్టేషన్‌కు అవసరాల కోసం వచ్చిన వారి వద్ద లంచం డిమాండ్ చేయడం వంటి ఆరోపణల నేపథ్యంలో పోలీస్ సిబ్బందిపై సస్పెన్షన్‌వేటు పడినట్లు సమాచారం.

రాజన్న సేవలో ఏఐసీసీ సెక్రెటరీ

వేములవాడ, ఏప్రిల్ 2: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ఏఐసీసీ కార్యదర్శి, మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్ల వంశీచంద్‌రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆయన స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి స్వామివారిని దర్శించుకున్నా రు. అనంతరం ఆయనకు అర్చకులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

నగదు పట్టివేత

బోయినపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని కొదురుపాక చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది 59 వేల రూపాయల నగదును పట్టుకున్నారు. నారాయణఖేడ్‌కు చెందిన సాయిలు కరీంనగర్ నుంచి వెళ్తున్నాడు. కొదురుపాక వద్ద చెక్ పోస్ట్ సిబ్బంది వాహనం తనిఖీ చేయగా 59 వేల రూపాయలు పట్టుబడ్డాయి. డబ్బులు ఎన్నికల అధికారికి అప్పగించినట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.

బైకు పైనుంచి పడి వృద్ధుడికి గాయాలు

చందుర్తి ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ రహదారిలో మంగళవారం రాత్రి బైకు అదుపు మర్రిగడ గ్రామానికి చెందిన దారం రాజిరెడ్డి (60) వృద్ధుడికి గాయాలయ్యాయి. పోలీసుల, గ్రామస్తుల కథనం ప్రకారం రాజిరెడ్డి చందుర్తి నుంచి మరిగడ్డకు బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. గాయపడిన రాజిరెడ్డిని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వస్త్ర సంక్షోభంపై కదిలిన సంఘాలు

- 6న నేతన్నల గర్జన - వస్త్ర పరిశ్రమ సంఘాలతో ఐక్యవేదిక ఏర్పాటు - సిరిసిల్లలో పారిశ్రామికులు, కార్మిక సంఘాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం

సిరిసిల్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్‌గా ఏర్పడ్డారు. ఈ నెల 6న సిరిసిల్లలో నేతన్నల గర్జనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని ప్రభుత్వం నివారించి వస్త్ర పరిశ్రమ సమస్యలను పరిష్కరించి నేతన్నలను ఆదుకోవాలని అందుకు అనుసరించాల్సిన వ్యూహంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదికగా 27 మందితో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఉపాధి కల్పించే విధంగా బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు వెంటనే అందించి నిరంతరం ఉపాధి కల్పించాలని, పవర్‌లూం పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీని అమలు చేయాలని కోరారు. బతుకమ్మ చీరలు, ఇతర ఆర్డర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని యారన్ సబ్సిడీ విడుదల చేయడంతో పాటు త్రిఫ్ట్ పథకం, నేతన్న బీమా, తదితర సంక్షేమ పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీన సిరిసిల్లలో నేతన్నల గర్జన సభ నిర్వహిస్తామని, పరిశ్రమపై ఆధారపడ్డ ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు.

● ఐక్యవేదిక ప్రతినిధులు వీరే..

వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక, జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులుగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, సిరిసిల్ల టెక్స్‌టైల్ జోన్ అధ్యక్షుడు మంచె శ్రీనివాస్, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కార్యాదర్శి పంతం రవి, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి వెల్దండి దేవదాస్, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, కాటన్ వస్త్రోత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనారాయణ, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, సైజింగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ రాజు, డైయింగ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి కోడం శ్రీనివాస్, మ్యాక్స్ సంఘాల అధ్యక్షుడు యెల్లండి శంకర్, అసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు రవీందర్, తంగళ్లపల్లి అధ్యక్షుడు గోనె పర్శరాములు, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సంపత్, జాపర్స్ యూనియన్ శ్రీనివాస్, గుమస్తా యూనియన్ అధ్యక్షుడు అశోక్‌తో పాటు అజ్జ వేణు, కుడిక్యాల కనకయ్య, బూట్ల సతీష్, మోర రాజు, వేముల దామోదర్, కొక్కుల వెంకటేశం, మండల రాజు కమిటీలో ఉన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు

నగదు పట్టివేత

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2: వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. వట్టెంల గ్రామం వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా వేములవాడకు చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి సరైన ఆధారాలు లేకుండా లక్ష రూపాయలు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్టు వద్ద 93,500నగదును మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ఏఈ సుమన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఆర్ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కేడీసీసీబీకి రూ.100 కోట్ల లాభం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.100.10 కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించి గత ఏడాది రికార్డును బ్రేక్ చేసిందని బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎన్.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 91.40 కోట్ల స్థూల లాభం నమోదు కాగా ఈ యేడాది రూ.8.70 కోట్లు అదనంగా లాభం ఆర్జించడం జరిగిందని అన్నారు. బ్యాంకు నిర్థరక ఆస్తులు గత ఏడాది 0.97శాతం నుంచి ఈయేడు 0.75శాతానికి తగ్గిందని, 0.22శాతం తగ్గింపు గొప్ప విజయమని, ఇది బ్యాంకు పాలకవర్గం, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే సాధ్యమైందని చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అభినందించారు. డిపాజిట్లలో కూడా 246.28 కోట్ల వృద్ధితో గత ఏడాది ఉన్న 2282.62 కోట్ల నుంచి 2528.90 కోట్లకు పెరిగాయని అన్నారు. అడ్వాన్సులు కూడా 18.85శాతం వృద్ధితో రూ.3973.34 కోట్లకు పెరిగాయని, బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.876.24 కోట్లకు పెరిగిందని అన్నారు. మొత్తం వ్యాపారం 6501.24 కోట్లుగా నమోదైందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత మూడో అగ్రగామి బ్యాంకుగా కేడీసీసీబీ నిలవడం గర్వకారణమని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 42మంది రైతులు 614క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా కనిష్ఠ ధర రూ.6,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 2: శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.

అదనపు కట్నం కోసం వేధింపులు

- కొడుకుకి విషగుళికలు తినిపించి మహిళ ఆత్మహత్య
- కూతురు, మనుమడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆమె తల్లి బలవన్మరణం ● ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



రేయాన్ష్ (ఫైల్)



గాదె శ్రీజ(ఫైల్)



జయప్రద(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2: వరకట్న వేధింపులతో అత్తింటివారు కొట్టి పుట్టింటికి పంపించగా, ఈ గొడవలను భరించలేక తల్లిగారింటికి వచ్చిన ఓ గృహిణి పేగు తెంచుకొని పుట్టిన ఏడాది కూడా నిండని 11 నెలల కొడుకుకు విషగుళికలు ఇచ్చి అవే విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు, మనుమడి బలవన్మరణాన్ని చూసి తట్టుకోలేని తల్లికూడా అవే విషగుళికలు వేసుకొని తనువు చాలించిన విషాద ఘటన కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామపంచాయతీలోని విజయనగర్ కాలనీలో కలకలం రేపింది. 24 గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు, కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.

కరీంనగర్ శివారులోని బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీకి చెందిన పూసల జయప్రద, వెంకటేశ్వరచారిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు గద్దె శ్రీజ(27)కు వరంగల్‌కు చెందిన మొద్దుంపూర్ నరేష్‌తో 2021 నవంబరు 27న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షల వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు అత్తింటివారు ముట్టజెప్పారు. ఏడాది వరకు ఆ దంపతుల జీవనం సాఫీగా సాగింది. వారికి ఒక కొడుకు రేయాన్ష్ అలియాస్ అర్విన్(11 నెలల 25 రోజులు)ఉన్నాడు. నరేష్ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ వరంగల్ ఎల్లంబజారులో ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. అదనపు వరకట్నం విషయంలో ఇటీవల భార్యాభర్తలు శ్రీజ, నరేష్‌ల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మార్చి 29న భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు కలిసి శ్రీజను కొట్టి, వరకట్నం తీసుకురావాలని కొడుకుతో సహా పుట్టింటికి పంపించారు. అయితే మంగళవారం ఉదయం 6 గంటలకు శ్రీజ తన భర్త నరేష్‌కు ఫోన్ చేసి ఈ నెల 5న కొడుకు రేయాన్ష్ పుట్టినరోజు ఉందని, భర్తను రావాలని కోరగా తను రానని, మీరే చేసుకోండని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భర్తతోపాటు అత్త, మామలు దూషిస్తూ నీవు చచ్చిపో అంటూ మాట్లాడారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీజ ఉదయం ఏడు గంటలకు తన ఏడాది వయసున్న కొడుకు రేయాన్ష్‌కు విషగుళికలు మింగించి తాను కూడా మింగింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తుండగానే ఇంటి వద్దనే రేయాన్ష్ మృతి చెందాడు. శ్రీజ స్పృహ కోల్పోయి నోటి నుంచి నురుగులు వస్తుండగా ఆటోలో అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి ఆసుపత్రిలో చికిత్స చేస్తుండగా శ్రీజ మరణించింది. అక్కడే ఉన్న శ్రీజ తల్లి పూసాల జయప్రద(51) ఆధార్‌కార్డు తీసుకువస్తానని ఇంటికి వెళ్లి బెడ్‌పైన ఉన్న విషగుళికలు మింగింది. పక్కనే ఉన్న ఒక మహిళ వారించేసరికే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మరణించింది. పూసాల జయప్రద కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా ఆమె భర్త వెంకటేశ్వరాచారి మానకొండూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మృతులు శ్రీజ తండ్రి, జయప్రద భర్త వెంకటేశ్వరచారి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీజ తన కొడుకును హత్య చేసినట్లు కేసు నమోదుకాగా శ్రీజను భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు వరకట్నం కోసం వేధించినట్లు, వారి వేధింపుల కారణంగానే శ్రీజ, ఆమె తల్లి జయప్రద ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ ఎస్‌ఐ వెంకట్రాజం తెలిపారు.

● విష ప్రభావం కలిగిన టాబ్‌లెట్స్ ఎక్కడి నుంచి వచ్చాయనేది అంతుబట్టకుండా ఉంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి శ్రీజ తెప్పించుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శ్రీజ ఆసుపత్రిలో మరణించగానే ఆధార్‌కార్డు కోసం అని మరో మహిళతో ఇంటికి వెళ్లిన జయప్రద ఇంటిలో బెడ్‌పైన ఉన్న ఆ విషగుళిక ఒక్కటి నోటిలో వేసుకోగా అక్కడే ఉన్న మహిళ ఆ గుళికను బలవంతంగా తీసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఆ క్షణంలోనే జయప్రద స్పృహకోల్పోయిందని బంధువులు తెలిపారు. ఆత్మహత్యకు నిర్ణయించుకునే సెనేడ్ అంతటి విషం కలిగిన గుళికలను శ్రీజ తెప్పిచ్చుకుని ఉంటుందని భావిస్తున్నారు.

● మరో మూడు రోజుల్లో రేయాన్ష్ పుట్టినరోజు ఉండగా అంతలోనే ఈ ఘటన జరుగడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఈ ఘటనను తలుచుకుని బంధువులతో పాటు గ్రామస్థులు కంటనీరు పెట్టారు. కొన్ని గంటల ముందు ఇంటిలో కూతురు, భార్య, మనుమడితో గడిపిన తండ్రి ఆ ముగ్గురు మరణంతో ఒంటరివాడయ్యాడు.

జలపతి తండాలో వివాహిత ఆత్మహత్య



శోభ (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2: చందుర్తి మండలం దేవుడి తండా గ్రామపంచాయతీ పరిధిలోని జలపతి తండాలో గుగులోతు శోభ(25) అనే మహిళ అదనపు వరకట్నం వేధింపులు తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జలపతి తండాకు చెందిన గుగులోతు జలం ధర్‌కు వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన శోభతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చి పెళ్లి జరిపించారు. వివాహం జరిగిన కొద్దిరోజులు వీరి కాపురం సాఫీగానే సాగింది. వీరికి నాలుగు సంవత్సరాల క్రితం కుమారుడు జన్మించాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య అదనపు వరకట్న వేధింపుల గొడవలు జరుగుతున్నాయి. కాగా సోమవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వరకట్న వేధింపులతో శోభ చనిపోయిందని మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో పంచనామా నిర్వహించి, డీఎస్పీ నాగేంద్రచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 2: జగిత్యాల అర్బన్ మండలం మోతె చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన రొడ్డ ఉమ మహేష్ (14) జగిత్యాల పట్టణ శివారులోని మోతె చెరువులోకి తన స్నేహితులతో కలిసి ఈతకొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

వీడనున్న విద్యార్థి మృతి మిస్టరీ

- వ్యవసాయ బావిలో మృతుడి తల లభ్యం ● పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపించిన పోలీసులు

తిమ్మాపూర్, ఏప్రిల్2: ఓ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఎనగంటి అభిలాష్ గత మార్చి 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27 రోజుల తరువాత మార్చి 27న తిమ్మాపూర్ గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభించింది. మృతదేహానికి తల లేకపోవడంతో విద్యార్థి అభిలాష్ ఆత్మహత్య చేసుకున్నడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థి కుటుంబ సభ్యులు కూడా విద్యార్థి అభిలాష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఎల్ఎండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు ఆరు రోజులుగా బావిలో ఉన్న నీటిని పెద్ద మోటర్లు, క్రేన్‌ల సహాయంతో, మనుషులను పెట్టి తీసేందుకు ప్రయత్నించగా మంగళవారం ఉదయం బావిలో తల భాగం(పుర్రె) లభించింది. సిఐ స్వామి, గన్నేరువరం ఎస్సై నరేష్ క్రేన్ సహాయంతో వ్యవసాయ బావిలోకి దిగి దానికి బయటకి తీయించారు. పుర్రెను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించి డీఎన్ఏ పరీక్షతో పాటు గాయాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ చేపట్టనున్నారు. రిపోర్టుతో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని, నివేదిక వచ్చేందుకు సుమారు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సీఐ స్వామి తెలిపారు. బావిలో నీటిని తోడేందుకు కృషి చేసిన వారిని అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



అరుణ్(ఫైల్)

జ్యోతినగర్,ఏప్రిల్2: ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దూకి మంగళవారం ములుకుంట్ల అరుణ్(23) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్కలపల్లి గేట్ ప్రాంతానికి చెందిన అరుణ్ మృతదేహాన్ని ఎన్టీపీసీ పోలీసులు రిజర్వాయర్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్(45) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్ రోజువారీగా గొర్ల కాపరిగా ఉంటూ సోమవారం ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో ఇంటి ముందు పడుకోగా ఉదయం లేచి చూసేసరికి మంచం కిందపడి ఉన్నాడు. మృతుడి భార్య సుజాత గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు తలకు తీవ్రగాయమైందని మృతిచెందినట్లు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య దాడి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అఖిల్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని సింగాపూర్ గ్రామ శివా రులో మార్చి 30వ తేదీన హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇజ్జిగిరి అఖిల్ రోడ్డు ప్రమాదానికి గురికాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అఖిల్ స్థానికంగా ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతుండగా తన మిత్రులను కలిసేందుకు సింగాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కుక్కకాటుతో యువకుడి మృతి



అరుణ్ (ఫైల్)

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని ధర్మారంలో కుక్క కాటుకు మంకు అరుణ్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మంకు వినోద, శంకర్ దంపతులు నిజామాబాద్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు అరుణ్ ధర్మారం గ్రామంలో ఉంటున్న నానమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. రెండు నెలల క్రితం నిజామాబాద్ గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన క్రమంలో గ్రామంలో పలువురితో పాటు అరుణ్‌ను పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కుక్క కాటుకు వైద్యం చేయించుకున్నప్పటికీ 15 రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు.

గంజాయి రవాణా చేస్తున్న తొమ్మిది మంది అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్



పట్టుకున్న గంజాయితో పోలీసులు (ఫైల్)

● రెండు కిలోల గంజాయి స్వాధీనం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2: గంజాయి రవాణా చేస్తున్న రెండు ముఠాలను అరెస్ట్ చేసినట్టు గోదావరిఖని ఏసీపీ రమేష్ తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాక చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు జరుపుతున్న సమయంలో ఇద్దరు యువకులు గంజాయి తరలిస్తూ పట్టుబడినట్టు ఏసీపీ పేర్కొన్నారు. వారివద్ద కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పాలకుర్తి నుంచి గంజాయి తీసుకువచ్చి యైటింక్లయిన్‌కాలతో పాటు సమీప ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపారు. కమాన్‌పూర్‌పోలీస్‌స్టేషన్ పరిధి జూలపల్లి శివారులో గంజాయి తరలిస్తున్న ఏడుగురిని కమాన్‌పూర్ పోలీసులు పట్టుకుని, వారి వద్ద కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్, సీఐ-2 లింగమూర్తి, కమాన్‌పూర్ ఎస్సై చంద్రశేఖర్, టూటౌన్ ఎస్సైలు వెంకటేష్, సనత్‌కుమార్ పాల్గొన్నారు.

రాణాలో ఉంచిన గంజాయి మాయం

సారంగాపూర్ : పోలీసుల తనిఖీల్లో పట్టుకున్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఏకంగా రాణా నుంచి ఎత్తుకెళ్లిన ఘటన చర్చనీయాంశంగా మారింది. 2023 ఫిబ్రవరిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజస్థాన్‌కు చెందిన ఓ అంబులెన్స్‌లో 70 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు నలుగురు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో భద్రపరిచి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్వార్టర్ పక్కన పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం పోలీసులు అంబులెన్స్‌ను పరిశీలించగా అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి అందులోని గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు ఏఎస్పీ వినోద్ కుమార్, డీఎస్పీ రఘు చందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకంగా పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి మాయం కావడంతో ఎస్పీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది.

ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని పలు తండాల్లో కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి ఐదు లీటర్ల గుడుంబా, ఎనిమిది వందల లీటర్ల బెల్లం పానకమును ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి తండా, గోవిందరావుపేట తండాలో గుడుంబాను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకమును స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు సూపరింటెండెంట్ పంచాక్షరి, ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు సత్వరమే అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు బాండ్‌లు ఇవ్వాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పీఆర్టీయూ కృషిచేస్తుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, సంఘ నాయకులు శశిధర్‌శర్మ, తూముకుంట మోహన్‌రెడ్డి, మాన్వాడ శంకర్, సందీప్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వనపర్తి వెంకటేష్ ఉన్నారు.

ప్రజా అభిప్రాయం మేరకే మేనిఫెస్టో

- బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్



రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్న మేనిఫెస్టో కమిటీ సభ్యులు

భగత్‌నగర్, ఏప్రిల్ 2: ప్రజా అభిప్రాయం మేరకే భారతీయ జనతాపార్టీ మేనిఫెస్టో ఉంటుందని మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి త్వరలో బీజేపీ పక్షాన ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించి విడుదల చేస్తామన్నారు. రైతులు ఏం కోరుకుంటున్నారో అభిప్రాయాలను చెప్పాలన్నారు. సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

వేములవాడలో ఒకరి దారుణ హత్య

- మద్యం మత్తులో స్నేహితుడే కడతేర్చినట్లు అనుమానం



సిర్రం మహేశ్(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 2: మద్యం మత్తులో కిరాతకంగా బండరాయితో కొట్టి స్నేహితుడినే చంపిన సంఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సిర్రం మహేశ్ (46) రెండు సంవత్సరాలుగా వేములవాడలో కూలి పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. స్థానిక భగవంతరావునగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్న మహేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మరో వ్యక్తితో పరిచయం ఏర్పడడంతో ఇద్దరు కలిసి తరచూ మద్యం సేవించేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం సేవించిన తర్వాత ఇరువురి మధ్య మాటా మాటా పెరగడంతో తోటి స్నేహితుడు రాయితో ముఖంపై బాధడంతో మహేష్ అక్కడికక్కడే చనిపోయాడు. సోమవారం ఉదయం ఇంటి అద్దె వసూలు కోసం వచ్చిన యజమాని శ్రీనివాస్ ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపు నెట్టగా తలుపు తెరుచుకుంది. ఇంట్లో మంచంపై ఎలాంటి చలనం లేకుండా పడి ఉన్న మహేష్‌ను చూసి తమకు సమాచారం అందించాడని పోలీసులు తెలిపారు. హత్య ఘటన సమాచారం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మద్యం సేవించిన అనంతరం మహేష్‌పై రాయితో దాడికి పాల్పడి హత్యకు కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కొండాపూర్‌లో విషాదం

ముస్తాబాద్: వేములవాడలో సోమవారం రాత్రి జరిగిన ఘటనలో కొండాపూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. తాగిన మత్తులో జరిగిన దాడిలో కొండాపూర్‌కు చెందిన సిర్రం మహేశ్ మృతి చెందాడని స్థానికులు తెలిపారు. కొంత కాలంగా వేములవాడలో కూలి పనిచేసుకుంటున్న మహేశ్ స్నేహితులతో జరిగిన గొడవలో మరణించాడని పేర్కొన్నారు. కనీసం ఇల్లు కూడా లేని సిర్రం మహేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ అనంతరం నేరుగా ఊళ్లో దహన సంస్కారాలకు తీసుకువెళ్లడం పలువురిని కలిచి వేసింది. మహేశ్‌కు భార్య సిర్రం పద్మ, ఇద్దరు పిల్లలున్నారు.

శిక్షణ కేంద్రాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కోసం ఉద్దేశించిన కేంద్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం పరిశీలించారు. సిరిసిల్ల డివిజన్‌కు సంబంధించి సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, వేములవాడ డివిజన్ కు సంబంధించి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు పోలింగ్ విధులు, నిర్వహణపై ఎన్నికల నిబంధనల మేరకు పకడ్బందీగా శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. సిరిసిల్లలో మొత్తం 1,685 మంది, వేములవాడలో మొత్తం 1,050 మంది సిబ్బందికి శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ నెల 4, 6వ తేదీల్లో పీవోలు, ఏపీవోలకు ఉదయం నుంచి సాయంత్రం వరకు, 8వ తేదీన ఓపీవో షిఫ్టుల వారీగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొంత మందికి, తిరిగి మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొంత మందికి శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తును శిక్షణా కేంద్రాల్లో అందించాలని సూచించారు. శిక్షణ కేంద్రాలకు వచ్చే సిబ్బందికి భోజన సదుపాయం, తాగునీటి సదుపాయం కల్పించాలని, కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్, సిరిసిల్ల ఏఆర్‌వో పి గౌతమి, వేములవాడ ఏఆర్‌వో రాజేశ్వర్, చీఫ్ ప్లానింగ్ అధికారి పీబీ శ్రీనివాస చారి, డీఈవో రమేష్ కుమార్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్ కుమార్, తహసీల్దార్లు షరీఫ్ మోహినొద్దీన్, మహేష్ కుమార్, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

టెట్ ఫీజు రద్దు చేయాలి



పోస్ట్ కార్డులతో నాయకులు, టెట్ అభ్యర్థులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2: టెట్ ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులతో మంగళవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో టెట్ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక హెడ్ పోస్టాఫీస్ వద్ద పోస్టు బాక్స్‌లో బీఆర్‌ఎస్వీ నాయకులు కార్డులను పోస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫీజులు లేకుండనే పరీక్షలను నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో టెట్ ఒక్క పేపర్‌కు రూ. 200, మూడు పేపర్లకు రూ. 400లు ఉండేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక పేపర్‌కు రూ. 1000, రెండు లేదా మూడు పేపర్లకు రూ. 2000లు ఫీజులను నిర్ణయించడం నిరుద్యోగులైన టెట్ అభ్యర్థులపై భారం మోపడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి అభ్యర్థులకు పెనుభారం అవుతుందని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఫీజులు లేకుండా పరీక్షలు నిర్వహిస్తామని అభయ హస్తం ఇచ్చి అధికారంలోకి రాగానే మొండి హస్తం చూపుతోందని ఆరోపించారు. టెట్ పరీక్షకు ఫీజుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా టెట్ అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా జిల్లాకో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్, పట్టణ ఇంచార్జి ఎస్కే బాబా, నాయకులు మెట్టెల సాయిదీపక్, వల్లబోజు వెంకటరమణ, టెట్ అభ్యర్థులు పాల్గొన్నారు.

పత్రికల పంపిణీ ఏజెంట్లకు స్థలాలు ఇవ్వాలి

- న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం



ఏజెంట్లను సన్మానిస్తున్న అధ్యక్షుడు సత్యం

సిరిసిల్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పత్రికలకు మధ్య వారధిగా న్యూస్ పేపర్లను పంపిణీ చేసే ఏజెంట్ల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాలు ఇవ్వాలని న్యూస్‌పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం అన్నారు. సోమవారం సాయంత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అర్‌ఎంపీ, పీఎంపీ భవన్‌లో సిరిసిల్ల పట్టణ న్యూస్‌పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ జిల్లా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏజెంట్లను సన్మానించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఏజెంట్లకు ఈ బైక్‌లు, పేపర్ బాయ్‌లకు సైకిళ్లు, అందించాలని అన్నారు. ప్రభుత్వ పరంగా రుణాలు అందించాలని ఫుడ్ డెలివరీ బాయ్స్‌లకు ఇస్తున్నట్లే పేపర్ ఏజెంట్లు, బాయ్స్ కు కూడా రూ 5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కే రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు యెల్లె రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి పోచంపల్లి రాజు, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి మల్లేశం, కోశాధికారి బొద్దుల బాలకిషన్, సంయుక్త కార్యదర్శి నాగభూషణం, భైరి దేవదాస్, పిస్క సాయికుమార్, రాగుల వేణు, నక్క వెంకటేష్, శ్రీకాంత్, గాజుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కోనరావుపేట, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఆర్‌ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని సుద్దాల, కనగర్తి, బావుసాయిపేట, నిమ్మపల్లి గ్రామాల్లో మంగళవారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు వంద రోజులు గడిచినా ఇంతవరకు అమలు చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 500 రూపాయలకే సిలిండర్, మహిళలకు 2500 సహాయం, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, రైతు భరోసా 15,000 రూపాయల వంటి హామీలను ఇచ్చి 100 రోజులు గడిచినా అమలు చేయడం లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ తెలంగాణ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి జరిగిందని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో 24 గంటల ఉచిత కరెంటు అందించడం జరిగిందన్నారు. కాళేశ్వరం ద్వారా సాగునీరు, పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 24 గంటల కరెంటు అందించామని అన్నారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ అరుణరాఘవరెడ్డి, వేములవాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చెలిమెడ లక్ష్మీనరసింహారావు, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, ఫ్యాక్స్ ఛైర్మన్లు బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు దేవయ్య, ప్రభాకర్‌రావు, మమతా మహేష్, కాశవేణి మహేష్ పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి





సిరిసిల్ల, కోనరావుపేట మండలం సుద్దాలలో నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌కు జిల్లాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ జిల్లా కమిటీ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా, పట్టణ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, బుర్ర నారాయణగౌడ్, పులి లక్ష్మిపతిగౌడ్, బొల్గం నాగరాజుగౌడ్, అమరేందర్‌గౌడ్, గుగ్గిళ్ళ జగన్‌గౌడ్, బండి దేవదాస్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్, పాములు దేవయ్యగౌడ్, బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, తాళ్ళపల్లి అంజయ్యగౌడ్, కందుకూరి రామాగౌడ్, గంట కార్తిక్‌గౌడ్, బండారి శ్రీనివాస్‌గౌడ్, బుర్ర రామచంద్రంగౌడ్, విక్కుర్తి పరశురాములు గౌడ్, వివిధ మండలాల సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని ఆత్మ బలిదాన్ దినోత్సవంగా నిర్వహించాలని జై గౌడ ఉద్యమ రాష్ట్ర అధికార ప్రతినిధి దత్తాద్రిగౌడ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, తదితర గ్రామాల్లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేశారు. సర్వాయి పాపన్న పోరాట పటిమతో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్ గౌడ్, లింగాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నారాయణగౌడ్, సుధాకర్‌గౌడ్, మల్లేశం గౌడ్, శ్రీధర్‌గౌడ్, బాలకృష్ణగౌడ్, బుచ్చాగౌడ్, ఎల్లాగౌడ్, పర్శగౌడ్, నారా గౌడ్, కిషన్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, శంకర్‌గౌడ్, నాగరాజు, అంజయ్య, ప్రదీప్‌గౌడ్, బాలగౌడ్, సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్ళపల్లి: మండలంలోని జిల్లెల్లలో గౌడ సంఘం, గౌడ యువసేన సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఫ్యాక్స్ ఛైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, ఆసరి బాలరాజ్, గుగ్గిళ్ళ శ్రీకాంత్‌గౌడ్, గౌడ యువసేన అధ్యక్షుడు తాళ్లపల్లి రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు కోడూరు నరేష్, సభ్యులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, కాశవేణి మహేష్, మాజీ సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి, శంకర్, గౌడ సంఘం నాయకులు వంగాల శ్రీనివాస్, పల్లి బుచ్చిరాములు, పల్లి శ్రీనివాస్, బుర్ర రమేష్, ప్రజాప్రతినిధులు కచ్చకాయల మహేష్, సింగల్ విండో వైస్ ఛైర్మన్ కాశవేణి మహేష్, కాదాసు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులపై ప్రభుత్వాల చిన్నచూపు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2: భవన నిర్మాణా కార్మికులను చూపుచూడడంతోపాటు కార్మికులకు నష్టం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటం రాజు అన్నారు. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌లోని అర్‌ఎంపీ, పీఎంపీ భవనంలో మంగళవారం సీఐటీయూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి రాజమౌళి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వేల నిర్మాణాలు జరుగుతున్నప్పటికి ప్రభుత్వానికి సెస్ పేరిట కట్టాల్సిన పన్ను వసూలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్మికులు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రచారాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులకు అడ్డాలలో షెడ్‌లను నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి, నాయకులు గురజాల శ్రీధర్, కేస బిక్షపతి, రాపెల్లి రమేష్, గుంటుక నరేందర్, రాజు, ఎల్లయ్య, కోల శ్రీనివాస్, మల్లేశం, సీఐటీయూ నాయకులు ఎలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ'కు ఎంపికైన సుద్దాల విద్యార్థి

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన కాకరకాయల రాఘవ తేజ సుద్దాలలోని రుషి వాణి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతూ నవోదయ ఎంట్రీ పరీక్షలు రాశాడు. కాగా ఋషి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఎంపిక కావడంపై స్కూల్ కరస్పాండెంట్ దాసు, ఉపాధ్యాయ బృందం అభినందన తెలిపారు.

వరదకాలువకు నీరు.. పంటలకు జీవం



నీటితో కళకళాడుతున్న వరద కాలువ

బోయినపల్లి, ఏప్రిల్ 2: వరద కాలువపై ఆధారపడి సాగు చేసిన పంటలు నిన్నటి వరకు ప్రశ్నార్థకంగా మారగా నేడు నీటి విడుదలతో వరి పంటకు జీవం పోసినట్లయింది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు నుంచి బోయినపల్లి మండలం మిడ్ మానేరు వరకు 122 కిలోమీటర్ల పొడవున వరద కాలువ ఉంది. ఐదేళ్లుగా కాళేశ్వరం జలాలతో జలకల సంతరించుకున్న వరద కాలువ పది రోజుల నుంచి పట్టిపోయి కల తప్పింది. కాలువ నీటిపై ప్రతీ ఏడాది రైతులు ఆధారపడి కాలువకు ఇరువైపులా వేలాది ఎకరాల భూములను సాగు చేస్తున్నారు. మొన్నటి రబీ సీజన్ ఆరంభంలో సమృద్ధిగా నీరు ఉండడంతో రైతులు వరి, మొక్కజొన్న పంటను సాగు చేశారు. మల్యాల మండలం వరద కాలువ 73వ కిలోమీటర్ల నుంచి 122 కిలోమీటర్ల వరకు నీరు తగ్గిపోవడంతో రైతుల ఆందోళనకు లోనయ్యారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన వరి పంట పొట్ట, ఈనె దశలో నీరు లేకపోవడంతో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో మిడ్ మానేరుకు కాళేశ్వరం నీటిని ఎత్తిపోయడంతో పాటు వరద కాలువ రివర్స్ పంపింగ్‌ను నిలిపివేశారు. దీంతో వరద కాలువపై ఆధారపడి సాగు తీసిన పంటలు ఎండే పరిస్థితి నెలకొంది. దీంతో వివిధ మండలాల చెందిన రైతులు స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి ఎల్లంపల్లి నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే ఎమ్మెల్యే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వరద కాలువకు ఎల్లంపల్లి నుంచి నీటితో విడుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో ఆదివారం గాయత్రి పంప్‌హౌస్ నుంచి 0.1 టీఎంసీ నీటిని కాలువలోకి ఎత్తిపోశారు. శ్రీరాంసాగర్ వరద కాలువకు నీటి విడుదల చేసేందుకు వీలు లేకపోవడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న కొంత నీటిని వరద కాలువకు విడుదల చేయడంతో, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు ఎండిపోతాయి అనుకున్న దశలో నీరు రావడంతో గుండె భారంతో ఉన్న రైతుల కళ్లలో ఆనందం నింపింది.

తొమ్మిది ఎకరాలు ఎండుతుండే...



- ల్యాధ రాము రైతు, రత్నంపేట

వరద కాలువపై ఆధారపడి తొమ్మిది ఎకరాల వరి పంటలు సాగు చేశాను. ముఖ్యంగా పంట ఈనే దశలో నీరు తగ్గిపోవడంతో ఎంతో దిగాలు చెందాను. ప్రస్తుతం నీరు రావడంతో పంటలకు జీవం పోసినట్లయింది.

రైతులకు అండగా ఉంటా...



- మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

వరద కాలువలో నీరు అడుగంటిన విషయం తన దృష్టికి రాగానే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశాను. వెంటనే ప్రభుత్వం ఎల్లంపల్లి నుంచి నీటి విడుదల చేయించడం సంతోషాన్నిచ్చింది. అంతేకాకుండా రైతులకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటా.

బీఆర్‌ఎస్‌ది పొలం బాట కాదు.. ఓట్ల బాట



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీఆర్‌ఎస్ పార్టీ పొలం బాట పట్టిందని.. బీఆర్‌ఎస్‌ది పొలంబాట కాదని ఓట్ల బాట అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన అన్నదాతలకు పరిహారం అందించని మాజీ సీఎం కేసీఆర్ పొలం బాట పట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్, బీఆర్‌ఎస్ నేతల తీరును రైతాంగం గమనిస్తోందని అన్నారు. పార్లమెంటులో గెలువాలనే లక్ష్యంతో పొలం బాట పేరిట రైతులను ప్రసన్నం చేసుకుందామనే కుయుక్తిని ఎన్నికల్లో బట్టబయలు చేస్తారని అన్నారు. పగటి వేషాలు మానుకుని కాళేశ్వరం నాణ్యత లోపం, చేసిన తప్పులను ఒప్పుకోవాలని లేకుంటే గుణపాఠం తప్పదని నర్సయ్య హెచ్చరించారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **ప్రతిపక్షంగా ప్రజలకు నిజాలు చెప్పండి..**

తంగళ్ళపల్లి: సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మధ్య కమీషన్ల పంపకాల్లో ఏర్పడిన బేధాభిప్రాయలు రైతుల పాలిట శాపంగా మారాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ విమర్శించారు. మంగళవారం మండలంలోని జిల్లెళ్ల గ్రామంలోని కాల్వలను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ కేటీఆర్ అండ్ కంపెనీ కేవలం కమీషన్ల కోసం కక్కుర్తి పడి పనులు పూర్తి చేయలేదని ఆరోపించారు. మండలంలో ఏ ఒక్క కాల్వ పూర్తి చేయలేదన్నారు. ఇతర పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నమ్మి పార్టీలోకి వస్తున్నారన్నారు. సొంత పార్టీ నేతలను నమ్మక ఫోన్లు ట్యాపింగ్ చేసిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ నేతల మాటలు నమ్మకనే ప్రజలు తిరస్కరించి ప్రతిపక్షంలో కూర్చోబెట్టారన్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉంటూ ప్రజాసమస్యలపై కేకే మహేందర్‌రెడ్డి పోరాడుతున్నారన్నారు. కేకేపై మరోసారి అవాకులు చవాకులు పేలితే సహించేది లేదన్నారు. రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే, చేసిన తప్పు, జరిగిన నష్టం తెలిపి వారికి బీఆర్‌ఎస్ నాయకులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సీతాలమ్మ బోనాలు

ముస్తాబాద్, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మడలేశ్వర స్వామి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా మంగళవారం పోచమ్మ బోనాలు, సీతాలమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో భైండ్లవారి ఆటలు, శివసత్తుల పునకా మధ్య ఊరంతా సల్లంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు శరయ్య, దీటి నర్సింలు, దీటి సత్తయ్య రజకసంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: మండలంలోని బుగ్గరాజేశ్వరతండాలో ఇటీవల మృతి చెందిన గజన్‌నాయక్ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. స్థానిక నాయకులు అనిల్‌నాయక్, రవినాయక్ సమకూర్చిన 50 కిలోల బియ్యాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, దేవరాజు, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు బాలకృష్ణ, అనిల్‌నాయక్, మోహన్, రవినాయక్, శ్రీనివాస్‌నాయక్, రాజునాయక్, శ్రీధర్, రాజేందర్, రాంరెడ్డి, హేమాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

వీర్నపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని రంగంపేటలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, బంజేరు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం

ముస్తాబాద్, ఏప్రిల్ 2: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా కూర భిక్షపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గందె చంద్రం, బండారి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీకాంత్, సలహాదారులుగా మాచెట్టి లక్ష్మణ్, కూర సంతోష్, కోశాధికారిగా పప్పుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా బంధువుల శ్రీనివాస్, ఉప్పల చంద్రం, పప్పుల భద్రయ్య, అమర్, రాజేందర్, రమేశ్, సురేందర్, గందె శ్రీనివాస్, కొసినిగెట్టి శ్రీనివాస్, సతీశ్, రవి, అంజయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ 'సింగిడి'ని విజయవంతం చేయాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2 : అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్రీయ కళామంచ్ సింగిడి-2024 పేరుతో నిర్వహించనున్న విద్యార్థి సాంస్కృతిక పోటీలను విజయవంతం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని పలు డిగ్రీకళాశాలలో మంగళవారం సింగిడి-2024 వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఏప్రిల్ 20, 21తేదీల్లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో విద్యార్థులందరు పాల్గొనాలని కోరారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను బయటకు తీసి ప్రపంచానికి చూపించే విధంగా ఈ వేదికను ఏర్పాటు చేశామన్నారు. సింగిడి కార్యక్రమంలో ప్రతీ ఒక్క విద్యార్థి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పులి రంజిత్, లోపెల్లి రాజురావు తదితరులు పాల్గొన్నారు.

శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో పురస్కారం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు కాల్వ రంజిత్‌కుమార్, ఎనగందుల శ్రీనులు హైదరాబాద్‌లోని శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో నంది ప్రతిభా పురస్కారాలను సోమవారం రాత్రి అందుకున్నారు. హైదరాబాద్‌లోని శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో కృషి చేస్తున్న పలువురిని ఎంపిక చేసింది. నిర్మాణ రంగంలో రంజిత్‌కుమార్, విద్యా రంగంలో శ్రీను చేస్తున్న కృషిని గుర్తించింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో పురస్కారాలను యువకులు అందుకున్నారు. శిఖర ఆర్ట్స్ ప్రోగాం డైరెక్టర్ ఉప్పులేటి నరేష్, కళాకారుడు, బీఆర్‌ఎస్ నేత దరువు ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐకి సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను స్థానిక నాయకులు బాలరాజుయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి స్థానిక కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎక్సైజ్ నేరాల నియంత్రణకు ప్రజలు తమకు సహకరించాలని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ కోరారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి ఆరోపించారు. మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 100 రోజుల్లో నెరవేరుస్తామని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి విస్మరించారని అన్నారు. మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వడగళ్ల వానలు, సాగునీరులేక ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ గ్రామాలను సందర్శించిన దాఖలాలు లేవన్నారు. అభివృద్ధికి ఏం చేశారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంపీపీ రేణుక, మండల కో ఆప్షన్ సభ్యుడు జబ్బర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీలను అమలు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 2: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు ఎలాంటి అంక్షలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ పట్టణ కమిటి అధ్యక్షుడు జిందం చక్రపాణి అధ్వర్యంలో నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ 25 వేల నష్టపరిహారాన్ని అందించి రైతులను అదుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో భాగంగా వరితోపాటు వివిధ పంటలకు మద్దతు ధరలతోపాటు రూ 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఎండి సత్తార్, కౌన్సిలర్‌లు లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో ఛైర్మన్ జీల కిషన్‌యాదవ్, గజభీంకార్ రాజన్న, అగ్గిరాములు, ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

● **నేతన్నలకు నిరంతరం ఉపాధిని కల్పించాలి**

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలలో నెలకొన్న సంక్షోభాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడంతోపాటు నేతన్నలకు నిరంతరం ఉపాధిని కల్పించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. సిరిసిల్లలో నేతన్నలు వస్త్ర పరిశ్రమలపైనే అధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్న స్థితిగతులను చూసి పనులు కల్పించాలని లేకుంటే అసెంబ్లీని నేతన్నలతో కలిసి ముట్టడిస్తామన్నారు.

5న జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ పర్యటన..

సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఈ నెల 5వ తేదీన మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పర్యటనలోభాగంగా నీళ్ల లేక ఎండిపోయిన పంటలతో పాటు వడగళ్ల వర్షానికి దెబ్బతిన పంటలను పరిశీలించి రైతులను పరామర్శిస్తారని తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, పట్టణప్రధాన కార్యదర్శి మ్యాన రవి, ఎండి సత్తార్, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో ఛైర్మన్ జీల కిషన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.